స్ట్రీట్‌లైట్స్ మరమ్మతులకు ప్రణాళికలు : రొనాల్డ్ రోస్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): వీధి దీపాల నిర్వహణలో ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, సమస్యను సమర్థవంతంగా పరిష్కరించేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రోస్ ఏజెన్సీలను ఆదేశించారు. సీడీఎంఏ కార్యాలయంలో గురువారం ఈఈఎస్ఎల్ ఏజెన్సీ అధికారులతో వీధిదీపాల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. వీధిదీపాల మరమ్మతులను వెంటనే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వీధి దీపాల నిర్వహణలో ఆరోపణలు, ఫిర్యాదులు వస్తే ఉపేక్షించమని కమిషనర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏజెన్సీ ప్రతినిధులు ఇంజనీర్ చీఫ్ జియాఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య రంగంలో పెరగనున్న ఏఐ వినియోగం


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వక్తలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రోగ నిర్ధారణ, చికిత్సల కోసం వైద్యరంగంలో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం నానాటికి పెరుగుతోందని ఏఐజీ ఆస్పత్రుల ఫౌండర్ చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. బయాలజీ, బయోటెక్నాలజీ, బయో ఇన్ఫర్మేటిక్స్ రంగంలో కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో భాగంగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ)లో గురువారం ప్రారంభమైన బయో అన్వేషణ 2024 సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. వైద్యరంగంలో ఏఐ వినియోగం కారణంగా రానున్న ఐదేళ్లలో పెను మార్పులు చోటు చేసుకుంటాయని తెలిపారు. కార్యక్రమంలో మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సెక్రటరీ డాక్టర్ రాజేష్ ఎస్ గోఖలే, వర్సిటీ వీసీ ప్రొఫెసర్ బీజేరావు, హెచ్‌సీయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ హెడ్ ప్రొఫెసర్ జేఎస్ఎస్ ప్రకాష్‌తోపాటు, పరిశోధక విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బసవతారకం ఆస్పత్రిలో 'యాక్ట్' క్లినిక్


'యాక్ట్' క్లినిక్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ పూర్ణ కుర్కురే తదితరులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కేన్సర్ వ్యాధిని జయించిన సర్వైవర్స్ మున్ముందు ఇబ్బందులు ఎదుర్కోకుండా జీవితాన్ని సాఫీగా గడపడానికి యాక్ట్ (ఆఫ్టర్ కాంప్లిషన్ ఆఫ్ థెరపీ) క్లినిక్‌ను బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ ఆస్పత్రి, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇంటర్నేషనల్ చైల్డ్ హుడ్ కేన్సర్ డే సందర్భంగా గురువారం ఇండియన్ కేన్సర్ సొసైటీ జాయింట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ పూర్ణ కుర్కురే ఈ క్లినిక్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్యరంగంలో ఆధునిక శాస్త్రీయ, సాంకేతిక విజ్ఞానం కారణంగా ఇప్పుడు కేన్సర్‌ను జయించిన వారి సంఖ్య పెరుగుతున్నదన్నారు. ఆస్పత్రి సీఈవో డాక్టర్ కె.కృష్ణయ్య మాట్లాడుతూ చికిత్స పూర్తి అయిన తర్వాత సాధారణ జీవనాన్ని సాగించడానికి అవసరమైన సలహాలు, సూచనలు, ఇతరత్రా ఇబ్బందులను దూరం చేయడానికి ఈ క్లినిక్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ వైద్యులు ఎంవీటీ కృష్ణమోహన్, డాక్టర్ సెంథిల్ రాజప్ప, కల్పనా రఘునాథ్, వీరేంద్ర పాటిల్, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

కాంటినెంటల్ ఆస్పత్రిలో..


సెమినార్‌లో పాల్గొన్న వైద్యులు

రాయదుర్గం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కేన్సర్ ఇమ్యూనో థెరపీ అపోహలను తొలగించడమే లక్ష్యంగా కాంటినెంటల్ ఆస్పత్రి పనిచేస్తుందని మెడికల్ ఆంకాలజిస్టు డాక్టర్ ఏవీఎస్ సురేష్ తెలిపారు. గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో గురువారం ఇమ్యూనో ఆంకాలజీలో అడ్వాన్స్ ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మసాచ్‌సెట్స్ జనరల్ ఆస్పత్రి కేన్సర్ సెంటర్ క్లినికల్ డైరెక్టర్, హార్వర్డ్ మెడికల్ స్కూల్‌లో ప్రొఫెసర్ డాక్టర్ కీత్‌ఫ్లాహెర్టీ మాట్లాడుతూ మిలనామ చికిత్స గురించి వివరించారు. ఈ సెమినార్‌లో ఇమ్యూనో థెరపీలో, క్లినికల్ డెవలప్‌మెంట్‌లో గుర్తింపు పొందిన డాక్టర్ రమీఇబ్రహీం, సీనియర్ అంకాలజిస్టు డాక్టర్ జగన్నాథ్, డాక్టర్ గురు ఎన్ రెడ్డి విశిష్ట పాల్గొన్నారు.

చిన్నారులపై లైంగిక వేధింపుల చిత్రాలు...

- సోషల్ మీడియాలో వైరల్ చేసిన యువకుడి అరెస్ట్


నిందితుడు జెమ్‌షెడ్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): చిన్నారులపై లైంగికదాడులకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు, ఇతర నిషేధిత సమాచారాన్ని ఫేస్‌బుక్, ఇతర సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్న వ్యక్తిని సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. సిటీ క్రైమ్స్ అండ్ సిట్ జాయింట్ సీపీ ఏవీ.రంగనాథ్ వివరాలు వెల్లడించారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన ఎస్‌కె.జమ్‌షెడ్ చిన్నారులపై లైంగిక దాడులకు సంబంధించిన సమాచారాన్ని సోషల్ మీడియాలో వ్యాప్తి చేస్తున్నట్లు సీఐడీ పోలీసులు గుర్తించారని తెలిపారు. తన పర్యవేక్షణలో డీసీపీ కవిత, ఏసీపీ శివమారుతి, ఇన్‌స్పెక్టర్ నరేష్ బృందం సాంకేతిక ఆధారాలు సేకరించి నిందితుడ్ని గుర్తించినట్టు తెలిపారు. పోలీస్ బృందం పశ్చిమబెంగాల్‌కు వెళ్లి నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు.

10 శాతం కమీషన్‌పై.. సైబర్ నేరగాళ్లకు బ్యాంకు అకౌంట్లు..

- చెన్నైకి చెందిన సైబర్ కిలేడీ ఆటకట్టించిన పోలీసులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): 10 శాతం కమీషన్ తీసుకుంటూ.. సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు సమకూర్చుతూ.. అమాయకులను మోసం చేస్తున్న సైబర్ కిలేడీని సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. సైబర్ క్రైమ్ జాయింట్ సీపీ తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన బాధితుడు సైబర్ నేరగాళ్ల వలకు చిక్కి ఇన్వెస్టిమెంట్ పేరుతో రూ. 5.84లక్షలు పోగొట్టుకున్నాడు. దాంతో సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన ఇన్‌స్పెక్టర్ నరేష్ టీమ్.. టెక్నికల్ ఎవిడెన్స్ సేకరించగా.. చెన్నైకి చెందిన ఒక బ్యాంకు ఖాతాలో బాధితుని డబ్బు జమయినట్లు గుర్తించారు. చెన్నైకి వెళ్లిన టీమ్ బ్యాంకు ఖాతా ఉన్న అడ్రస్‌లో ఆరా తీయగా.. సైబర్ నేరగాళ్లతో చేతులు కలిపిన ఒక మహిళ తన పేరుతో బ్యాంకు ఖాతాలు తీసి 10 శాతం కమీషన్‌తో సైబర్ నేరగాళ్లకు అద్దెకు ఇస్తున్నట్లు తెలిసింది. టెలీగ్రామ్‌లో పరిచయం అయిన ఒక మహిళ ఆదేశాలతో ఇలాంటి మోసపూరితమైన పనులు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించి ఆమెను అరెస్టు చేసి నగరానికి తీసుకొచ్చి కటకటాల్లోకి నెట్టారు.

సమతామూర్తి చిట్‌ఫండ్ కేసులో కీలక సూత్రధారి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): చిట్టీల పేరుతో ప్రజలను మోసం చేసిన సమతామూర్తి చిట్‌ఫండ్ కేసులో కీలక నిందితుడు సంస్థ అదనపు డైరెక్టర్ క్యాతం గణేష్(44)ను సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం అధికారులు అరెస్ట్ చేశారు. ఇల్పుల శ్రీనివాస్, అతడి కుమారుడు రాకేష్ వర్మ సమతామూర్తి చిట్‌ఫండ్‌ను ప్రారంభించారు. గతంలో చిట్‌ఫండ్ మోసాలు చేసిన క్యాతం గణేష్ అదనపు డైరెక్టర్‌గా ఇందులో చేరాడు. మోసపూరిత వాగ్దానాలతో 110మంది నుంచి రూ. 1.30 కోట్లు వసూలు చేసి బోర్డు తిప్పేశారు. వీరిపై పలువురు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టిన సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం అధికారులు క్యాతం గణేష్‌ను గురువారం అరెస్ట్ చేశారు.

భూ వివాదం.. లాయర్, ఎమ్మెల్యేపై కేసు

(3వ పేజీ తరువాయి)

మ్యానేజ్ చేయాలని, అందుకు రూ. 10కోట్ల వరకు ఖర్చు అవుతుందని నమ్మబలికాడు. దాంతో సంఘం సభ్యులంతా డబ్బులు పోగేసి రూ. 7 కోట్లు వెంకటరమణకు ఇచ్చారు. ఇక మనం కేసు గెలిచినట్లేనని, మీరు స్వీట్లు పంచుకోవడానికి సిద్ధంగా ఉండాలని బాధితులను నమ్మించాడు. కానీ, అడ్వొకేట్ ఏనాడూ కేసును సీరియస్‌గా తీసుకోలేదు. అనుమానంతో అడ్వొకేట్ తీరుపై ఆరా తీయగా, ప్రత్యర్థుల నుంచి రూ.25 కోట్లు తీసుకొని వారికి సహకరిస్తున్నట్లు బాధితులు గుర్తించారు. తమ డబ్బు తిరిగి ఇవ్వాలని అతడిపై ఒత్తిడి చేశారు. రూ. కోటి తిరిగి ఇచ్చిన వెంకటరమణ మిగిలిన డబ్బులు ఇవ్వకుండా వారిని వేధిస్తున్నాడు. మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాలను సంప్రదించి సంఘం నాయకుల నుంచి తనను బయటపడేయాలని మొరపెట్టుకున్నాడు. ఎమ్మెల్యే, అయన అనుచరులు సంఘం నాయకులపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. దాంతో వేదుల వెంకటరమణ, ఎమ్మెల్యే బలాల నుంచి తమ సంఘానికి, తమ కుటుంబాలకు ప్రాణహాని ఉందని బాధితులు సీసీఎస్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు న్యాయవాది, మలక్‌పేట ఎమ్మెల్యేపై కేసు నమోదు చేశారు.

అడ్డదిడ్డంగా పార్కింగ్

- హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్ల వద్ద అవస్థలు
- నిత్యం ట్రాఫిక్ సమస్యలు


లింగంపల్లి చౌరస్తా వద్ద ఓ హోటల్ ఎదుట రోడ్డుపైనే పార్క్ చేసిన వాహనాలు


పాత సిండికేట్ బ్యాంకు పక్కన ఓ టిఫిన్ సెంటర్ ఎదుట..

బర్కత్‌పుర, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలోని కాచిగూడ, నల్లకుంట, అంబర్‌పేట పీఎస్ పరిధుల్లో వానాలు అడ్డదిడ్డంగా పార్క్ చేస్తున్నారు. హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్ల వద్ద సరైన పార్కింగ్ లేదు. అల్పాహారం భోజనాలు చేయడానికి వచ్చే వారు తమ వాహనాలను రోడ్లమీదే పార్క్ చేస్తున్నారు. దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. దాంతో ప్రాంతాల్లో రాకపోకలకు అవస్థలు పడుడుతున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. కొందరు పోలీసులకు మామూళ్లు ముడుతుండడంతో తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

పార్కింగ్ సదుపాయం లేని హోటళ్లు, టిఫిన్ సెంటర్లు...

- కాచిగూడ వెంకటరమణ థియేటర్ ఎదురుగా ఉన్న ఓ హోటల్‌కు పార్కింగ్ లేదు.
- లింగంపల్లి చౌరస్తా వద్ద రోడ్డును ఆక్రమించి టిఫిన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు, ఇదే చౌరస్తా వద్ద ప్రధాన హోటల్ ఉంది.
- సీసీ షరాఫ్ ఆస్పత్రి ఎదురుగా టిఫిన్ సెంటర్, శంకర్ మఠం పక్కన హోటల్, పాత సిండికేట్ బ్యాంకు శివంరోడ్డులో హోటల్, అలీకేఫ్ చౌరస్తా, కాచిగూడ కబేళా, అంబర్‌పేట తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా, బతుకమ్మకుంట తదితర ప్రాంతాల్లో హోటళ్లు, టిఫిన్ సెంటర్లు ఉన్నాయి.
- కొంతమంది ఏకంగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు.
- కాచిగూడ రైల్వే స్టేషన్ ఎదురుగా వీరన్నగుట్టకు వెళ్లే దారిని ఆక్రమించి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు.

ఈ సమస్యపై పలుమార్లు ఆయా పోలీసు స్టేషన్ల అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ పార్కింగ్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

టీఎంసీ నేత షాజహాన్‌ను అరెస్ట్ చేయాలి


డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న బీజేపీ మహిళా మోర్చా నేతలు

కవాడిగూడ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మహిళా మోర్చా చేపట్టిన దర్నా ఉద్రిక్తతకు దారితీసింది. పశ్చిమ బెంగాల్‌లో మహిళలపై లైంగిక దాడులు, వేధింపులకు పాల్పడుతున్న తృణమూల్ కాంగ్రెస్ నేత, అతని అనుచరుల తీరును వ్యతిరేకిస్తూ గురువారం బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి ఆధ్వర్యంలో లోయర్ ట్యాంక్ బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసనకు దిగారు. పశ్చిమ బెంగాల్ సీఎం మమతాబెనర్జీ, తృణమూల్ కాంగ్రెస్ నేత షాజహాన్ దిష్టిబొమ్మలను దహనం చేయడానికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, మహిళామోర్చా కార్యకర్తల మధ్య వాగ్వావాదం, తోపులాట జరుగగా, రోడ్డుపై బైఠాయించడంతో ట్రాఫిక్ స్తంభించింది. మహిళామోర్చా కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేసి ముషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా శిల్పారెడ్డి మట్లాడుతూ, పశ్చిమ బెంగాల్ మహిళలకు రక్షణలేకుండా పోయిందని ధ్వజమెత్తారు. లైంగిక వేధింపులకు పాల్పడ్డ తృణమూల్ నేత షాజహాన్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా మోర్చా కార్యకర్తలు అనంతలక్ష్మి, పద్మజ, నిత్యపారిక్, డాక్టర్ పద్మ, గీతారెడ్డి, విజయక్ష్మి, పలువురు మహిళలు పాల్గొన్నారు.

చర్చిలు, క్రైస్తవులపై దాడులను అరికట్టాలి


మాట్లాడుతున్న క్రిస్టియన్ కాంగ్రెస్ వారియర్స్ అధ్యక్షుడు జి.భరత్, వర్కింగ్ ప్రెసిడెంట్ జాన్‌కెనడీ

రాంనగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని చర్చిలు, క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని తెలంగాణ క్రిస్టియన్ కాంగ్రెస్ వారియర్స్ డిమాండ్ చేసింది. గురువారం గోల్కొండ చౌరస్తా ఎంబీ చర్చిలో విలేకరుల సమావేశంలో తెలంగాణ క్రిస్టియన్ కాంగ్రెస్ వారియర్స్ అధ్యక్షుడు జి.భరత్, వర్కింగ్ ప్రెసిడెంట్ జాన్‌కెనడీ, సభ్యులు బిషప్ డాక్టర్ విలియం సింగం, సీ.డానియల్ అదామ్, ఏస్తేర్‌రాణి, శాంసన్, ప్రసాద్, అబ్రహం మాట్లాడారు. నగర శివారులోని జన్‌వాడా గ్రామంలో చర్చిపై, క్రైస్తవులపై దాడులకు పాల్పడిన ప్రతి ఒక్కరిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర డీజీపీ చర్యలు తీసుకోవాలని వారు కోరారు. క్రైస్తవులపై దాడులు చేస్తున్నది ఆర్ఎస్ఎస్, భజరంగ్‌దళ్ కార్యకర్తలని, ఆ రెండు సంస్థలను నిషేధించాలని వారు డిమాండ్ చేశారు. జన్‌వాడా గ్రామంలో జరిగిన దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. తమకు రక్షణ కల్పించాలని త్వరలో డీజీపీకి వినతిపత్రం సమర్పించనున్నట్లు తెలిపారు.

నిందితులను అరెస్ట్ చేయాలి: వడ్లమూరి స్వరూప్

కవాడిగూడ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): క్రిస్టియన్లు, చర్చిలపై దాడికి పాల్పడిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ డిమాండ్ చేశారు. గురువారం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మాట్లాడూతూ చేవెళ్ల నియోజకవర్గం.. శంకర్‌పల్లి మండలం, జొన్నాడ గ్రామంలో దళితులు, దళిత క్రిస్టియన్లపై మారణాయుధాలతో దాడిచేసి హత్యాయత్నానికి యత్నించారని ఆయన ఆరోపించారు. సమావేశంలో పార్టీ నేతలు బీరం సతీష్ కుమార్, సుబ్బారావు, గణేష్, ఎం.రవి తదితరులు పాల్గొన్నారు.

మతతత్వ శక్తులతో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు అన్యాయం: ప్రజా సంఘాలు

నల్లకుంట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మతతత్వ శక్తులు కుట్రలతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు తీరని అన్యాయం చేస్తున్నాయని పలు ప్రజా సంఘాల నేతలు ఆరోపించారు. దీంతో జరుగుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచంలోని అగ్రదేశాలు సహితం బ్యాలెట్‌తో మాత్రమే ఎన్నికలు నిర్వహిస్తున్నాయని వారు గుర్తుచేశారు. గురువారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం ఫ్రంట్ చీఫ్ కన్వీనర్ సనా ఉల్లాఖాన్, మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్, తెలంగాణ ముస్లిం ఫ్రంట్, ఆలిండియా ముస్లిం మైనారిటీ ఫోరం నేతలు ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్, ఎం.జహీరుద్దీన్, సలీం మాల్‌హిందీ, కమల్ అత్తర్, ఖలీల్ రసూల్‌ఖాన్, నయిమూల్లా షరీఫ్, సలీం భాషా, ఎంఏ. సిద్దిఖీ, ఎండీ.తాజుద్దీన్, న్యాయవాది మసూద్ ఆలీ, ఎం.అఫ్జల్, నర్సింగ్ తదితరులు మాట్లాడారు. ఈవీఎంలతో ఎన్నికలు నిర్వహిస్తే తిరిగి బీజేపీ గెలిచే అవకాశం ఉందని వారు ఆరోపించారు. గతంలో ఈవీఎంలను వ్యతిరేకించిన బీజేపీ.. ఇప్పుడు ఈవీఎంలను కోరుకుంటుందన్నారు. ఈవీఎంలను నిషేధించి బ్యాలెట్ పద్దతిలో ఎన్నికలు నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. గత పదేళ్లలో నిరుద్యోగులకు ఉద్యోగాలు లేకపోవడంతోపాటు నిత్యావసర ధరలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడేందుకు 'బీజేపీ హఠావో దేశ్‌కు బచావో' నినాదంతో ఈ నెల 18న ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.


వీర జవాన్లకు నివాళులర్పిస్తున్న డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, సి.కృష్ణయాదవ్ తదితరులు

పుల్వామా వీర జవాన్లకు ఘన నివాళ్లు

గోల్నాక, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బీజేవైఎం గోల్నాక డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఛేనెంబర్ చౌరస్తాలో పుల్వామా దాడిలో వీర మరణం పొందిన వీర జవాన్లకు ఘన నివాళులర్పించారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు, మాజీమంత్రి సి.కృష్ణయాదవ్ వీర జవాన్లకు నివాళులర్పించి మాట్లాడారు. దేశ రక్షణ కోసం పోరాడుతూ అమరులైన అమర జవాన్ల బలిదానం దేశ ప్రజల హృదయాలను కల్చివేసిందని, వారి బలిదానం మరవలేనిదన్నారు. బీజేవైఎం గోల్నాక డివిజన్ అధ్యక్షుడు సింగీతం రాజేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేసరి నర్సింగ్ రావుయాదవ్, నియోజకవర్గ కన్వీనర్ శ్యామ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్స్‌కు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

- అసోసియేషన్ ప్రతినిధి రచన ముద్రబోయిన

రాంనగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా 10 లక్షలకు పైగా ట్రాన్స్‌జెండర్స్ ఉన్నారని, వారందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆలిండియా ట్రాన్స్‌జెండర్స్ అసోసియేషన్ ప్రతినిధి రచన ముద్రబోయిన డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీపీఎస్‌కే, సిబ్బా, గరిమ సంస్థల ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్స్‌కు నిత్యావసరాలు పంపిణీ చేశారు. రచన ముద్రబోయిన మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్స్‌పై వివక్ష, వేధింపులు, హింసను అరికట్టాలన్నారు.

8వ బెటాలియన్‌లో గృహసముదాయానికి శంకుస్థాపన


గృహసముదాయానికి శంకుస్థాపన చేస్తున్న రాష్ట్ర అడిషనల్ డీసీపీ స్వాతిలక్రా

గచ్చిబౌలి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో సిబ్బంది కోసం రూ.13కోట్లతో నిర్మించనున్న గృహసముదాయానికి రాష్ట్ర అడిషనల్ డీసీపీ స్వాతి లక్రా, ఐజీబీ రమేష్ శంకుస్థాపన చేశారు. స్వాతిలక్రా మాట్లాడుతూ గృహసముదాయన్ని నాణ్యత ప్రమాణాలతో వేగంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ సన్నిసిబ్బంది పాల్గొన్నారు.

పోగొట్టుకున్న 150 సెల్‌ఫోన్ల స్వాధీనం

- బాధితులకు అందజేసిన రైల్వే అదనపు డీజీపీ మహేష్ భగవత్
- సీఈఐఆర్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోండి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే పరిధిలో వేర్వేరు సందర్భాల్లో ప్రయాణికులు పోగొట్టుకున్న లేదా చోరీ అయిన 150 సెల్‌ఫోన్లను రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రైల్వే అదనపు డీజీపీ మహేష్ భగవత్, రేల్వే ఎస్పీ సలీమ బాధితులకు సెల్‌ఫోన్లు అందజేశారు. గురువారం సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సికింద్రాబాద్ రైల్వే జోన్ పరిధిలోని ఖాజీపేట, నాంపల్లి, కాచిగూడ, సికింద్రాబాద్ పరిధిలో రైళ్లల్లో ప్రయాణించిన పలువురు ప్రయాణికులు తమ సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయని ఫిర్యాదు చేశారని అన్నారు. దర్యాప్తులో భాగంగా తాము సీఈఐఆర్ పోర్టల్‌లో రిజిస్టర్ చేయించి, ఆ ఫోన్లు ఎక్కడ ఉన్నాయి, ఎవరు వాడుతున్నారు అనే వివరాలు సేకరించనట్టు చెప్పారు. కేరళ-5, ఉత్తర ప్రదేశ్-4, మహారాష్ట్ర -13, కర్నాటక -11, మధ్యప్రదేశ్ -8, బిహార్-6, తమిళనాడు -7, ఏపీ-38, తెలంగాణ -58 సెల్‌ఫోన్లు రైళ్లలో దొంగలించబడ్డాయని, మొత్తం 150 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నాం. దాదాపు 30 రోజుల్లో 150 సెల్‌ఫోన్లు రికవరీ చేశామని అన్నారు. సెల్‌ఫోన్లను రికవరీకి కృషి చేసిన సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి, ఖాజీపేట్ రైల్వే కానిస్టేబుళ్లకు రైల్వే డీజీ మహేష్ భగవత్ నగదు రివార్డులను అందజేశారు. సమావేశంలో సికింద్రాబాద్ రైల్వే సీఐ సాయి ఈశ్వర్‌గౌడ్, కాచిగూడ సీఐ ఎల్లప్ప, ఐటీ ప్రత్యేక టీం ఎస్సై కుమార్, ఎస్సై మాజీద్ పాల్గొన్నారు.

ప్రయాణికులు జాగ్రత్తగా ఉండాలి

రైలులో ప్రయాణిస్తున్నప్పుడు గుర్తుతెలియని వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలి. కొంతమంది తక్కువ ధరకు ఫోన్ అమ్ముతామంటూ వస్తారు. అటువంటి ఫోన్లు అన్నీ చోరీ చేసినవే ఉంటాయి. సెల్‌ఫోన్ పోయిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకుంటే ఆ ఫోను ఎవరు వాడుతున్నది. ఏ ప్రాంతంతో ఉంది అనే వివరాలు బాధితుడు ప్రస్తుత సెల్‌ఫోన్‌కు మేసేజ్ వస్తున్నది.


సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్ తదితరులు

సేవాలాల్ జయంతి, వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి

కవాడిగూడ/చిక్కడపల్లి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): గిరిజనుల ఆరాధ్య దైవం సద్గురు సంతు సేవాలాల్ జయంతి, వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ డిమాండ్ చేశారు. గిరిజనులకోసం తన జీవితాన్ని త్యాగం చేసిన వ్యక్తి సేవాలాల్ అని కొనియాడారు. గురువారం ఇందిరాపార్కు చౌరస్తాలో సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను రాథోడ్ రమేష్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలువేసి నివాళులర్పించారు. చిక్కడపల్లి నగర గ్రంథాలయ సంస్థ ఆవరణలో సేవాలాల్ జయంత్యుత్సవాలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పద్మశ్రీ అవార్డుగ్రహీత కేతావత్ సోమ్లా నాయక్, నగర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పొట్లూరు పద్మజ, బంజారా రాష్ట్ర నాయకులు రాజ్‌కుమార్‌జాదవ్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. రియాజ్, బీఆర్ఎస్ నేత ముఠా జైసింహ, బీజేవైఎం నేత వినయ్‌కుమార్ పాల్గొని సేవాలాల్ సేవలను కొనియాడారు.

కాంగ్రెస్ హయాంలోనే అన్ని వర్గాలకు న్యాయం


అనిల్‌కుమార్ యాదవ్‌ను సన్మానిస్తున్న లింగాల శ్రీకాంత్‌గౌడ్

ముషీరాబాద్/చిక్కడపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ హయాంలోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతున్నదని రాజ్యసభకు ఎంపికైన ఎం. అనిల్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం కాంగ్రెస్ ముషీరాబాద్ నియోజకవర్గ బీ-బ్లాక్ అధ్యక్షుడు పట్నం నాగభూషణం గౌడ్, సేవాదళ్ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షురాలు స్వప్న, గాంధీనగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ, పార్టీ నాయకులు వేర్వేరుగా అనిల్ కుమార్‌యాదవ్‌ను సన్మానించారు. అనంతరం అనిల్ కుమార్ మాట్లాడుతూ కష్టపడి పనిచేసే వారికి అధిష్ఠానం గుర్తించి పదవులు ఇస్తున్నదనడానికి తానే నిదర్శనమని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.

ముషీరాబాద్ డిప్యూటీ కమిషనర్‌గా ఖాదర్ మొహినుద్దీన్ బాధ్యతల స్వీకరణ

రాంనగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ సర్కిల్ 15 ముషీరాబాద్ డిప్యూటీ కమిషనర్‌గా ఖాదర్ మొహినుద్దీన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన డాక్టర్ తిప్పర్తి యాదయ్య హయత్‌నగర్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఖాదర్ మొహినుద్దీన్‌ను సర్కిల్ 15 డీఎంసీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ముషీరాబాద్ సర్కిల్ 15 టౌన్‌ప్లానింగ్ ఏసీపీగా పనిచేస్తున్న రమేష్‌ను కూకట్‌పల్లి సర్కిల్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో శ్రీధర్‌గౌడ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సర్కిల్ 16 అంబర్‌పేట ఏసీపీ వీరస్వామిని బదిలీ చేయగా, ఆయన స్థానంలో వేణుగోపాల్ నియమితులయ్యారు. ప్రసుత్తం వీరు బాధ్యతలు తీసుకోవాల్సి ఉంది.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి

- బాధ్యతలు స్వీకరించిన సీఐ రవి

ముషీరాబాద్/రాంనగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు కూడా సహకరించాలని ముషీరాబాద్ సీఐ ఎన్. రవి అన్నారు. ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్.రవి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌చార్జి సీఐగా పనిచేస్తున్న వెంకట్‌రెడ్డి ఆయనకు గురువారం బాధ్యతలు అప్పగించారు. నగర గంగపుత్ర సంఘం ఉపాధ్యక్షుడు ప్రసాద్, ఆలిండియా గంగపుత్ర సంఘం ఉపాధ్యక్షుడు పూస గోరక్‌నాథ్ మర్యాదపూర్వకంగా సీఐని కలిసి సన్మానించారు.

ట్యాంక్‌బండ్‌పై ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

- సీఎం రేవంత్‌కు జాతీయ ఎంబీసీ సంఘాల లేఖ

రాంనగర్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటుచేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి జాతీయ ఎంబీసీ సంఘాల కమిటీ కన్వీనర్ కొండూరి సత్యనారాయణ లేఖ రాశారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రజకారులకు వ్యతిరేకంగా ఐలమ్మ ఎన్నో ఉద్యమాలు చేసిందని ఆమెను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విగ్రహ ఏర్పాటు కోసం కొంతకాలంగా పోరాడుతున్నామన్నారు.

ఛత్రపతి శివాజీ జయంతిని సెలవు దినం ప్రకటించాలి

- సీఎం రేవంత్‌రెడ్డికి సీడీ.చవాన్ వినతి

నల్లకుంట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని, ఛత్రపతి మహారాజ్ ఫౌండేషన్ చైర్మన్ సీడీ చవాన్ కోరారు. ఈ మేరకు ఈ నెల 19న శివాజీ జయంతి సందర్భంగా సెలవు ఇవ్వాలని ఆయన సీఎం రేవంత్‌రెడ్డిని సచివాలయం వద్ద కలిసి వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు. హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

నగరంలోకి గూడ్స్ వాహనాల ఎంట్రీ సమయం పెంచాలి

- బీపీటీఎంఎంఎం జాతీయ ప్రధాన కార్యదర్శి అల్లూరి రవిశంకర్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): నగరంలోకి డీసీఎం గూడ్ వాహనాల ఎంట్రీ సమయం పెంచాలని బీపీటీఎంఎంఎం జాతీయ ప్రధాన కార్యదర్శి అల్లూరి రవిశంకర్ డిమాండ్ చేశారు. గురువారం ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని నగర కార్యాలయంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి సమ్మయ్యయాదవ్, ఉపాధ్యక్షుడు ఎండీ హబీబ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. డీసీఎం వాహనాలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు రాత్రి 9 నుంచి ఉదయం 8 గంటల వరకు అనుమతి ఇవ్వాలన్నారు. డీసీఎం, గూడ్స్ డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలన్నారు.

అంతర్జాతీయ కిక్ బాక్సింగ్‌లో నగర విద్యార్థికి సిల్వర్ మెడల్


సిల్వర్ మెడల్‌తో హర్ష

బర్కత్‌పుర, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో మూడు రోజుల పాటు జరిగిన అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో నగరానికి చెందిన మల్లెల హర్ష జూనియర్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించాడు. మేడిపల్లికి చెందిన మల్లెల హర్ష 6వ తరగతి చదువుతున్నాడు. ఢిల్లీ నుంచి గురువారం నగరానికి వచ్చిన మల్లెల హర్ష బషీర్‌బాగ్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. కిక్ బాక్సింగ్‌లో అంతర్జాతీయస్థాయిలో చాంపియన్‌షిప్ సాధించడమే తన లక్ష్యమని, కిక్ బాక్సింగ్‌లో రాష్ట్రానికి పేరు తేస్తానని అన్నారు. ఈ సందర్భంగా పలువురు క్రీడాకారులు మల్లెల హర్షకు శాలువాకప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

కనులపండువగా మహాపూర్ణాహుతి హోమం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని శ్రీశృంగేరి జగద్గురు మహా సంస్థానము శ్రీపంచముఖ ఆంజనేయ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహోత్సవాల సందర్భంగా గురువారం కనులపండువగా మహాపూర్ణాహుతి హోమం నిర్వహించారు. సుప్రభాతం, శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్రపారాయణ, అర్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
అంజిరెడ్డి : 99859 21362